క్లుప్తంగా

బ్రిడ్జికి రెయిలింగ్ ఏర్పాటు



లింగసముద్రం బ్రిడ్జికి ఏర్పాటు చేసిన ఇనుపరాడ్లు

సాక్షి ఎఫెక్ట్..

దక్కిలి : మండలంలోని లింగసముద్రం వద్ద అలపలేరుపై రాపూరు–వెంకటగిరి జాతీయ రహదారిలో నిర్మించిన బ్రిడ్జికి రక్షణ ఇనుప రాడ్లు (రెయిలింగ్) ఏర్పాటుచేశారు. గతంలో ఈ రాడ్లు విరిగిపోయి ప్రమాదకరంగా మారాయి. దీనిపై ఈ నెల 13 గురువారం సాక్షి దినపత్రికలో ప్రమాదకరంగా బ్రిడ్జి రెయిలింగ్ అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై హైవే అథారిటీ అధికారులు స్పందించారు. శనివారం బ్రిడ్జికి రెయిలింగ్‌ను ఏర్పాటు చేశారు.

వార్డు ప్లానింగ్ కార్యదర్శి సస్పెన్షన్

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని రాజగోపాలపురం సచివాలయంలో టీపీబీవో ఇన్‌చార్జిగా పనిచేస్తున్న వార్డు ప్లానింగ్ కార్యదర్శి కె.వెంకటేష్‌ను సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలో అనధికార కట్టడాలు, లేఔట్లపై సకాలంలో చర్యలు చేపట్టకపోవడంతోపాటు, అధికారుల ఆదేశాలు పాటించనందుకు వేటు వేసినట్లు వెల్లడించారు. వెంకటేష్ నిర్లక్ష్యం కారణంగా హైకోర్టులో సంజాయిషీ ఇచ్చుకునే పరిస్థితి వచ్చిందన్నారు. ఆర్ముగం నగర్ సచివాలయం వార్డు ప్లానింగ్ కార్యదర్శి షేక్ హుమయూన్ బాషాకు టీపీబీవో ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.

ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న ఊహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామి, అమ్మవార్లకు క్షీర హరిద్ర కుంకుమ, అభిషేకాలు చేశారు. అష్టోత్తరాలను నిర్వహించారు. నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

తూర్పుపూండ్లలో పోలీసు పహారా

సైదాపురం: మండలంలోని తూర్పుపూండ్లలో పోలీసు పహారాతోపాటు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో గొడవలు జరిగే అవకాశం ఉండడంతో శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆ గ్రామంలో పర్యటించారు. వివాదానికి గల కారణాలపై విచారణ చేపట్టా రు. శాంతిభద్రతలకు ముప్పు ఏర్పడకుండా ఉండేందుకు ముందస్తుగా ఏడుగురు పారామిలిటరీ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చెత్త నిల్వల తొలగింపు



రవినగర్‌లో పారిశుద్ధ్య పనులు

కోట : కోట పంచాయతీ పరిధిలోని రవినగర్‌లో శనివారం మురుగునీరు, చెత్త తొలగింపునకు చర్యలు తీసుకున్నట్టు కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు. ఇక్కడ కాలువల్లో అపరిశుభ్రత కారణంగా దోమలు వృద్ధిచెంది జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో పారిశుద్ధ్య కార్మికులు చెత్త నిల్వలను తొలగించి, కాలువలను శుభ్రం చేశారు. మందు పిచికారీ చేశారు.

గ్రామాల మధ్య వివాదంపై విచారణ

కోట : మండలంలోని యమదిన్నెపాళెంలో శనివారం పోలీసులు, రెవెన్యూ అధికారులు విచారణ జరిపారు. యమదిన్నెపాళెంలోని సర్వే నంబర్ 708లో ఒక పరిశ్రమకు చెందిన భూములను సర్వే చేస్తుండగా చిల్లకూరు మండలం మన్నెగుంటకు చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో యమదిన్నెపాళెం, మన్నెగుంట గ్రామస్తుల మధ్య వివాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ నాగబాబు, వీఆర్వో శ్రీనివాసులు, సర్వేయర్ జనార్దన్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇరు గ్రామాల వారితో చర్చించారు. సంబంధిత భూమి యమదిన్నెపాళెం పరిధిలోకి వస్తుందని తేలడంతో మన్నెగుంట వాసులు వెనుదిరిగారు.

రోడ్డు పక్కకు ఒరిగిన బస్సు

కోట : మండలంలోని కొండుగుంట వద్ద ప్రధాన రహదారిపై శనివారం ఆర్టీసీ బస్సు గొర్రెలను తప్పించబోయి పక్కకు ఒరిగింది. కోట నుంచి గూడూరుకు ప్రయాణికులతో వెళుతున్న బస్సు కొండుగుంట వద్దకు చేరుకుంది. అక్కడ రోడ్డులో ఎదురుగా గొర్రెలు రావడంతో డ్రైవర్ బస్సును అదుపు చేసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బస్సు రోడ్డు పక్కకు ఒరిగింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని ప్రయాణికులు తెలిపారు.

కండలేరులో 6.448 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 6.448 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 20, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలలో సమకూరిన వసతులు

పిల్లలకు మనం అందించే ఆస్తి విద్య. విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చు. ఈ విషయం తెలుసుకున్న గత ప్రభుత్వం పాఠశాలలపై దృష్టిపెట్టింది. నాడు–నేడు కింద కార్పొరేట్‌కు దీటుగా వసతులు కల్పించింది. మెరుగైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా దొరవారిసత్రంలోని అక్కరపాక పాఠశాలలో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. ఆహ్లాదకర వాతావరణం కల్పించింది. దీంతో పిల్లలు ఉత్సాహంగా బడికి వెళుతున్నారు.

– దొరవారిసత్రం

- నాడు–నేడు కింద పలు అభివృద్ధి పనులు
- ఆహ్లాదకర వాతావరణం



నాడు–నేడుతో మారిన అక్కరపాక ప్రాథమికోన్నత పాఠశాల. గతంలో అక్కరపాక పాఠశాల(ఇన్‌సెట్)

దొరవారిసత్రం మండలంలోని 22 పాఠశాలల్లో మన బడి నాడు–నేడు కింద విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించారు. ముఖ్యంగా అక్కరపాక గ్రామ పరిధిలోని ప్రాథమికోన్నత పాఠశాల గతంలో దుస్థితిలో ఉండేది. సరైన వసతులు ఉండేవి కాదు. మరుగుదొడ్లు లేక పిల్లలు ఇళ్లకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. పిల్లలు కిందనే కూర్చొనేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మన బడి నాడు–నేడు కింద రెండు విడతల్లో రూ.24 లక్షలు మంజూరు చేయడంతో విద్యార్థులకు, అటు టీచర్లకు అవసరమైన అన్ని వసతులు సమకూరాయి. అదనపు భవన నిర్మాణం, తాగునీటి సదుపాయం, గదుల్లో బెంచీలు, ఆర్‌ఓ ప్లాంట్, బాలికలు, బాలురులకు వేర్వేరుగా మరుగుదొడ్లు నిర్మాణం చేపట్టారు. భవనాలకు మరమ్మతులు చేయించారు. విద్యుత్ సదుపాయం తదితర పనులు చేపట్టారు. విద్యార్థులను ఆకట్టుకునేలా, వారి విజ్ఞానం పెంపొందేలా తరగతి గది గోడలు, ప్రహరీ గోడపై బొమ్మలను తీర్చిదిద్దారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 53 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. నలుగు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.

విద్యార్థులకు అన్నీ సమకూరాయి



అక్కరపాక ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు ప్రస్తుతం అన్ని వసతులు సమకూరాయి. అదనపు భవనంలో ఫ్లోరింగ్ పనులు పూర్తి చేస్తే విద్యార్థులకు భవనం అందుబాటులోకి వస్తుంది. అలాగే బెంచీలు ఏర్పాటుచేశాం. బాలబాలికలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు నిర్మించాం.

– ఎం.రాధాకృష్ణయ్య, హెచ్‌ఎం, అక్కరపాక ప్రాథమికోన్నత పాఠశాల



నిర్మాణంలో ఉన్న అదనపు పాఠశాల భవనం, బెంచీలపై కుర్చొని పాఠాలు వింటున్న విద్యార్థులు, ఆర్‌ఓ ప్లాంట్, గోడలపై చిత్రించిన బొమ్మలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్య



రాపూరు–గోనుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న చిన్నారులు

రాపూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాలతో కూడిన విద్యను నేర్పిస్తున్నామని, మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి కోరారు. ఆమె శనివారం గోనుపల్లి సెక్టార్ పరిధిలోని తెగచర్ల, గోనుపల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రీ స్కూల్ విద్య, పౌష్టికాహారంపై తల్లులకు అవగాహన కల్పించారు. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కాత్యాయిని, అక్కమ్మ, లక్ష్మీప్రసన్న, రమ్య పాల్గొన్నారు.

సమస్యలపై దృష్టిసారించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి

సూళ్లూరుపేట రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారించాలని ఎంపీపీ అల్లూరు అనీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా జలజీవన్ మిషన్, జాతీయ ఉపాధి హామీ తదితర పనులపై సమీక్షించారు. ఎంపీపీ మాట్లాడుతూ రైతులు, ప్రజలకు సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో చంద్రమౌళి మాట్లాడుతూ పట్టణంలోని ప్రైవేట్ స్కూళ్ల బస్సుల వేగాన్ని నియంత్రించాలన్నారు. వాహన ఫిట్‌నెస్, ప్రతి సీటుకు సిటు బెల్ట్, సరైన పత్రాలు ఉండేలా చూడాలని ఎంఈవోలను ఆదేశించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా పరిశీలించాలని సూచించారు. జెడ్పీటీసీ ఉగ్గుముడి సుప్రియ తదితరలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న సోలార్ శాస్త్రవేత్త రమేష్, విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న రమేష్

ఓజిలి: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని భారతదేశ సోలార్ శాస్త్రవేత్త రమేష్ తెలిపారు. అంతర్జాతీయ పర్యావరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. అడవులు, మొక్కలను సంరక్షించడం వల్లన వర్షాలు అధికంగా కురుస్తాయని చెప్పారు. విద్యార్థులు మొక్కలు నాటాలని సూచించారు. అలాగే పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ఒక్కో సబ్జెక్ట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కల్లూరు సుజాత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు. విద్యార్థులకు మెడల్, ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారు. సోలార్ శాస్త్రవేత్త రమేష్‌ను హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు సన్మానించారు.

పోలిశెట్టి పార్కును పరిశీలించిన కురుగొండ్ల

వెంకటగిరి (సైదాపురం) : వెంకటగిరిలోని పోలిశెట్టిగుంట పార్కును, తహసీల్దార్ కార్యాలయం సెంటర్ వద్ద ఉన్న పాత అన్నా క్యాంటీన్ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలిశెట్టి గుంట పార్కు అభివృద్ధి పనుల్లో అవకతవకలు జరిగాయని, వాటి రికార్డులను సమర్పించాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్‌ను ఆదేశించారు. అదేవిధంగా త్వరలో వెంకటగిరి, రాపూరులో అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి రూ.5లకే భోజనం అందించనున్నట్లు తెలిపారు.



పోలిశెట్టి గుంట పార్కును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కనుల పండువగా శ్రీవారి కల్యాణం

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోన శనివారం భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయ స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం 4 గంటలకు అభిషేకం, 5 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు పూలంగి సేవ నిర్వహించారు. 10 గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నిత్యకల్యాణ మండలపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య కల్యాణాన్ని అంగరంగ వైభవంగా చేశారు. రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చెరువుకు నీరు అందించాలని వినతి

పెళ్లకూరు : 71వ నంబరు జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పూడ్చేసిన వ్యవసాయ కాలువను పునరుద్ధరించి చెరువులకు సాగునీరు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని శనివారం రావులపాడు రైతులు కోరారు. వారు శనివారం స్థానిక తహసీల్దార్ ప్రసాద్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించారు. రహదారి అభివృద్ధి పనులు చేపట్టి మెగా ఇన్‌ఫ్రా కంపెనీ యాజమాన్యం టెంకాయతోపు గ్రామ సమీపంలో స్వర్ణముఖి, తెలుగుగంగ 7వ బ్రాంచ్ కాలువల ద్వారా రావులపాడు చెరువులకు సాగునీరు సరఫరా చేసే కాలువను పూడ్చేశారు. దాంతో చెరువులకు నీరు సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై పలుమార్లు కంపెనీ ప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా స్పందించలేదని రైతులు వాపోయారు. పూడ్చేసిన వ్యవసాయ కాలువను పునరుద్ధరించి చెరువులకు సాగునీరు సరఫరా చేయాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ పూర్తి స్థాయిలో పరిశీలించి చర్యలు చేపడతామన్నారు. రైతులు కేవీ నాయుడు, రమణయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ ప్రసాద్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న రావులపాడు రైతులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి పల్లకీ సేవ



లక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న అర్చకులు, అధికారులు

చిల్లకూరు : మండలంలోని కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ, స్వామికి సుప్రభాత సేవ చేపట్టారు. అనంతరం పలు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీ సేవను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా వజ్జవారిపాళెం గ్రామానికి చెందిన వంశీరెడ్డి, వన్యరెడ్డి వ్యవహరించారు. ఆలయ ఈవో తాతా శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న ఉభయకర్తలు

నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ అండర్ -17 విజేత తిరుపతి



మొదటి స్థానంలో నిలిచిన తిరుపతి జట్టు, కార్యక్రమానికి హాజరైన నాయకులు

నాయుడుపేట టౌన్: నాయుడుపేట ఏఎల్‌సీఎం క్రీడామైదానంలో శుక్రవారం నిర్వహించిన అండర్–17 ఫుట్‌బాల్ పోటీల్లో తిరుపతి జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో రేణిగుంట, మూడో స్థానంలో సూళ్లూరుపేట జట్లు నిలిచాయి. నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కామిరెడ్డి రాజారెడ్డి ఆర్థిక సౌజన్యంతో టోర్నమెంట్ నిర్వహించారు. 10 జట్లు పాల్గొన్నాయి. టోర్నమెంట్ సమన్వయకర్తగా గౌస్‌బాషా వ్యవహరించారు. తిరుపతి ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి రెడ్డెప్ప, జాయింట్ కన్వీనర్ రమేష్ ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. మ్యాచ్ రిఫరీలుగా నారాయణ హైస్కూల్ పీఈటీ మధు, ప్రిన్స్, నాని వ్యవహరించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు రాజారెడ్డి క్రీడాకారులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసం కలిగిస్తాయన్నారు. ఆరోగ్యకరమైన మనుషులు తయారైతేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జలదంకి వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ యువకులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. యువకులకు క్రీడాపోటీలు ఏర్పాటు చేసిన నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్‌ని అభినందించారు. ప్రముఖ న్యాయవాది చదలవాడ కుమార్ మాట్లాడుతూ నాయుడుపేట పట్టణంలో ఇటువంటి మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందనీయులని పేర్కొన్నారు. నాయుడుపేట పరిసర ప్రాంతాల్లోని యువకుల ప్రతిభను గుర్తించి వారికి శిక్షణ ఇస్తున్న నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులను అభినందించారు. టోర్నమెంట్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన తిరుపతి, రేణిగుంట, సూళ్లూరుపేట జట్లకు కేఆర్ యువసేన తరఫున కామిరెడ్డి రాజారెడ్డి చేతుల మీదుగా ట్రోఫీలు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో కేఆర్ యువసేన సభ్యులు కాలగంధ సునీల్, నాయుడుపేట ఫుట్‌బాల్ క్లబ్ సభ్యులు కళాచంద్, భావన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి ప్రతిభ



లోహిత్



కళ్లజోడుపై చిత్రించిన చిత్రాలు

సైదాపురం: ఫాదర్స్ డేను పురస్కరించుకుని ఒక చిన్నారి కళ్లజోడుపై తల్లిదండ్రుల చిత్రాన్ని గీశాడు. మండలంలోని ఓరుపల్లికి చెందిన మేకా రమేష్ కుమారుడు లోహిత్ గిద్దలూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. బాలుడు చిన్నప్పటి నుంచి చిత్రాలు గీస్తున్నాడు. క్రీడల్లోనూ రాణిస్తూ పలువురి మన్ననలు అందుకుంటున్నారు. ఈ క్రమంలో ఫాదర్స్ డే సందర్భంగా కళ్లజోడుపై తల్లిదండ్రుల చిత్రాలను గీశాడు. వాటిని చూసి పలువురు అభినందిస్తున్నారు.

నీట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థికి అభినందనలు



ముఖేష్‌ను అభినందిస్తున్న సర్వజ్ఞకుమార యాచేంద్ర

వెంకటగిరి రూరల్ : ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో ప్రతిభ చూపిన వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన విద్యార్థి ముఖేష్‌ను శనివారం వెంకటగిరి రాజా కుటుంబ సభ్యుడు సర్వజ్ఞకుమార యాచేంద్ర అభినందించారు. ఆయన మాట్లాడుతూ వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలం వెంగమాంబపురం గ్రామానికి చెందిన ముఖేష్ చౌదరి నీట్‌లో ప్రతిభ కనబరిచడం వెంకటగిరికే గర్వకారణమని, బాగా చదువుకుని మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. వెంకటగిరిలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు లేవని, యువత బాగా చదువుకుని వెంకటగిరిలో మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు. అనంతరం ప్రముఖ వైద్యుడు కళాధర్ విద్యార్థి ముఖేష్‌ను అభినందించి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు, న్యాయవాది జయప్రకాష్‌జెట్టి, మురళీనాయుడు, ఆవుల వెంకటేశ్వర్లు, యస్థానిబాషా తదితరులు పాల్గొన్నారు.